శ్రీ.రం.పరిమి



# అబ్బాయి-అమ్మాయి కథ

అబ్బాయి పేరు సుబ్బారావు. అబ్బాయి ఉన్న ఊరు, ఎవరేగంగలో దూకితే నాకేం అని పట్టనట్లు ఊరుకునే పెద్ద పట్టణమూ కాదు. అలా అని ప్రతియింటి రగడను ప్రతియింటా చెప్పుకొనే చిన్న పల్లెటూరూ కాదు. కాలం అబ్బాయి యింజనీరింగ్ చదువుతున్న రోజులు. మరీ ఖచ్చితంగా చెప్పాలంటే పరీక్షలు వ్రాసి యింటికి వచ్చి తీరికగా సెలవల్ని దొర్లిస్తున్న రోజులు. ఉన్న ఊర్లో చదవకపోవడం మూలాన బోలెడు లాభాలు. నాన్న ఒప్పుకోని ఖర్చులకు డబ్బు. అమ్మకిష్టంలేని సెకండ్ షో సినిమాలు. అందమైన అమ్మాయిని కొంచెం నిదానంగా చూడగలగటం తప్పు అనేవాళ్ళు చుట్టూ లేకపోతే అవి చేయరాని తప్పులుగా కని

పించవు. (అందుకే అమేరికాలో తప్పులు చేయడం సులభం మనవాళ్ళకి) సెలవలకి యింటికి వచ్చినప్పుడు లభించే విఐపి ట్రీట్ మెంట్. ఆ లా భాలలో కొన్ని మచ్చు తునకలు. సుబ్బారావుకి ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న వయస్సు ఉంది. ఆ వయస్సుకి ఉండ వలసిన శ్రద్ధకూడా ఉంది. అతడు బయటకు కనబడే తీరులో (జేబులోని నల్ల కళ్ళద్దాలను తడుముకుంటూ, ఎండ వస్తే బావుండును అని అనుకోగల శ్రద్ధ నేను చెప్పబోయిన ఊరులాంటి ఊరులో అబ్బాయి-అమ్మాయి కథలాంటి కథలో అబ్బాయికి అనసూయ అనబడే చెల్లె లుంది.

అమ్మాయి పేరు రాధ. మిగతావన్నీ నచ్చితే అమ్మాయి నచ్చలేదని చెప్పనవ సరంలేని అందం. వున్న ఊర్లోనే కాలేజిఉంది కాబట్టి రాధ పి యు సి చదవాలని వాళ్ళింట్లోవాళ్ళు డిసైడ్ చేసిన తరువాతి రోజులు మన కథా కాలం. అమ్మాయికి సినిమాలంటే చాలా యిష్టం ఆంధ్రప్రభలోని సీరియల్స్ (ముఖ్యంగా రచయిత్రులవి) అంటే యిష్టం. (అందా నికి తోడుగా నొక్కుల జుట్టుండి, బాగా డబ్బుండి, యూనివర్శిటీ ఫస్టులు వచ్చి పాటలు ఘంటసాలలాగాపాడగలిగి, అవ సరమైనప్పుడల్లా త్యాగాలు చేయగల హీరో అంటే యిష్టంలేని పెళ్ళికాని అమ్మాయిలు, దిగులుపడని పెళ్ళయిన అమ్మాయిలు చాలా చాలా తక్కువని నా ఉద్దేశ్యం. అమ్మాయిలకు మొగుళ్ళు నచ్చక పోవడానికి పత్రికల్లో కథలు, తెలుగు సినిమాలు ఇతోధికంగా సాయం చేస్తున్నాయని కూడా నా ఉద్దేశ్యం) అమ్మాయి యింటిని అబ్బాయి యింటిని ఊరులోనిచిన్ని పేటలోని రోడ్డుమాత్రమే విడదీస్తోంది రాధకు అనసూయంటే కూడా యిష్టం. అనసూయకు రాధ యిష్టం అంటే యిష్టం.

ఓ మంచిరోజు రాధ అనసూయతో 'దసరాబుల్లోడు'కి వెళదాం అనడం, సుబ్బారావు వినడం యాక్సిడెంట్ కాదేమో. రాధ వినడానికి వీలుగా అని ఉండవచ్చు. సుబ్బారావు వినడానికి కష్టపడి ఉండవచ్చు. మొత్తానికి వినడం జరిగింది కాబట్టి, సుబ్బారావు సినిమా హాలుకి అరగంట ముందుగా వెళ్ళడం ఇన్‌టెన్షనల్‌గా జరిగింది. రారేమో నని పదకొండవసారి అనుకుంటూ ఉండగా రాధను, ఆ తర్వాత అన సూయను చూచి పెద్దగా ఆశ్చర్య పోయాడు. అనసూయకు అలా కని పించాడు. కనీసం అలా కనిపించానని అనుకున్నాడు. సెలవలకువచ్చి ఎన్నో రోజులుకాలేదు కాబట్టి (జేబుల గలగలలు ఆగిపోలేదు కాబట్టి) వీలైనంత నాచు రల్‌గా రిజర్వ్‌డ్ టికెట్ కౌంటరుదగ్గ రకు నడిచాడు సుబ్బారావు. అనసూయ రాధవైపు గర్వంగా చూచినట్లుంది. రాధ

సుబ్బారావుని అనసూయలో చూచి నట్లుగా సిగ్గుపడినట్లుంది. సుబ్బారావు, అనసూయ, రాధ వరుసగా హాలులోపలికి నడిచారు. రాధ సీటుప్రక్కన సీటు లేకుండా చూసుకుని అదే వరుసలో కూర్చున్నారు. ఆ విధంగా ఓ సీటు దూరంలో దగ్గరకు వచ్చారు సుబ్బారావు రాధలు మొదటిసారిగా.

అనసూయకు ఆలశ్యంగా, అనసూయ ప్రక్కన కూర్చున్నవాళ్ళకు తొందరగా లైట్లు ఆరిపోయాయి. చీకటి యిచ్చిన ధైర్యంతో సుబ్బారావు రాధలు అనసూయను మర్చిపోయారు అప్పు డప్పుడు మరిచి పోనప్పుడు అనసూయతో మాట్లాడారు. వాణిశ్రీ వయ్యారాలు రాధకు నచ్చకపోవడం. నాగేశ్వరరావు కుప్పిగంతులు సుబ్బారావుకి నచ్చకపోవడం అనసూయకు అర్థం కాలేదు. అనసూయకు రాధ మామూలు కన్నా తక్కువ మాట్లాడినట్లూ, సుబ్బారావు ఎప్పటికన్నా ఎక్కువ మాట్లాడి నట్లూ అనిపించింది.

అలా మొదలయిన పరిచయం అంతటితో ఆగిపోతే కథ పూర్తికాదు కాబట్టి ఆ తర్వాత అనసూయ లేకుండా చాటుగా చాలాసార్లు కలుసుకున్నారు. సుబ్బారావుకి రాధంటే ప్రేమ, రాధకు సుబ్బారావంటే ప్రేమ అని నాకు తెలియని 'ప్రేమ'కు అర్థం కల్పించాలనిలేదు.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

"నీవు లేకుండా నేను బ్రతకలేను"

"నీకోసం నేను చేయలేనిది ఈ ప్రపంచంలో ఏమీలేదు." లాంటి మాటలు వాళ్ళిద్దరిమధ్యన జరగలేదని మాత్రం గట్టిగా చెప్పగలను. ఆ మాటలు ఇలా ఉండి ఉండవచ్చు.

శుక్రవారం :

"అనసూకి తెలుసా నీవు క్లాస్‌కి వెళ్ళలేదని "

"ఊహుఁ..."

"ఉ..."

"తెలియదు"

సోమవారం :

"అనసూయకు తెలుసనుకుంటాను."

"ఏం ? నీతో ఏమన్నా అందా ?"

"లేదు కానీ, నిన్న మంజు వాళ్ళింటికి వెళ్ళానంటే నమ్మనట్లు చూసింది."

"అనసూకి తెలిసినా ఫరవాలేదు మరెవరికీ చెప్పదు."

గురువారం :

"నిన్న ఎందుకు రాలేదు ?"

"పిన్నితో బజారుకు వెళ్ళవలసి వచ్చింది "

"అనసూకి చెప్పిఉండవచ్చుగా."

"వీలులేకపోయింది"

తప్పు చేస్తున్నాం అనేభావన యిద్దరిలోనూ ఉంది. తప్పుచేస్తున్నాం అనే బాధలేదు అందరికీ తెలిసి పోతుందనే భయంమాత్రం ఉంది. ప్రపంచంలో ఆ యిద్దరే ఉండి ఉంటే తప్పుచేస్తున్నాం

అనే భావనకూడావచ్చి ఉండేది. కాదేమో సుబ్బారావు రాధలు ఈ రకంగా దగ్గరకు రావడానికి గల కారణాలన్నిటిలోనూ ముందుగా చెప్పవలసింది. అందుబాటు. సుబ్బారావు సుబ్బారావు కాకపోయినా ఫరవాలేదు. రాధ రాధ కాకపోయినా ఫర్వాలేదు. ఒకరినుండి మరొకరు ఎటువంటి గొప్పతనం ఆశించకపోవడం ఆ నిజాన్ని ఋజువుచేస్తుంది. సుబ్బారావు "నేను రాధను తప్ప మరెవరినీ పెళ్ళిచేసుకోను" అని వాళ్ళింట్లో చెప్పాలని రాధ కానీ రాధ తనతో లేచిపోవడానికి సిద్ధంగా ఉండాలని సుబ్బారావుగానీ ఏ సమయంలోనూ అనుకుని ఉండరు. అలా అనుకోవడానికి వీలులేనంతమంచివాళ్ళువాళ్ళిద్దరూ. ప్రపంచం ప్రేమమయంకాదు. మనుషుల మయం అని ఇద్దరికీ తెలుసు.

సుబ్బారావు సెలవలుఅయిపోయాయి. ఉత్తరాలు వ్రాసుకుందాం అని అనుకోకుండానేవిడిపోయారు విడిపోతున్నందుకు బాధ పడ్డారు. సుబ్బారావు రాధను గురించి ఆలోచించడం మానలేదు. కాకినాడలో కూడా. ఆ ఆలోచనలతో ఎక్కువగా భయపడేవాడు. అనసూయ ఉత్తరంలో లేని విషయం కోసం పది సార్లు వెతికేవాడు. ఒకవేళ అనసూయకు తెలియదేమోనని భయానికి కారణం కల్పించుకునే వాడు. తను చేసిన తప్పుకి ఋజువుని వదిలిపెట్టి వచ్చానేమోనని భయపడే సుబ్బారావు మంచితనం పాఠకులకు పిరికితనంగా తోచవచ్చు. సంఘానికి భయపడని మనిషి మంచివాడు కాలేడనే నా వాదన.

సుబ్బారావు గురించి ఎక్కువ ఆలోచించడం ఇష్టం లేక కావచ్చు, రాధ అనసూయను మంజులతతోరిప్లేస్‌చేసింది. కాకినాడలోని సుబ్బారావు భయపడటానికి గల కారణం రాధకు లేదు. అందుకే సుబ్బారావు గురించిన ఆలోచనలు రోజు రోజుకీ తగ్గిపోయాయి. సుబ్బారావు మంచితనం (పిరికితనం) తెలిసిన రాధ నిశ్చింతగా నిద్ర పోగలిగింది, సుబ్బారావు నిద్ర పాడుచేసుకున్న రాత్రులన్నీను. సుబ్బారావు భయంగురించి తనకు తెలిసి ఉంటే, దాన్ని పోగొట్టడానికి ఓ ఉత్తరం లాంటిది వ్రాసి ఉండేదే మంచి మనసుగల అమ్మాయి రాధ.

ఓ రోజు పసుపు అంచుల కవరులోని శుభలేఖలో "...గోవర్ధనరావు యం. బి. బి యస్ కి...రాధాకుమారిని యిచ్చి..." అని చదువుతూ తేలికగా గాలి పీల్చాడు అబ్బాయి సుబ్బారావు.

